సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



రైతు వేదికలో వసతులు కరువు
మోత్కూరు మండల పరిధిలోని పాటిమట్ల క్లస్టర్ రైతు వేదికలో మౌలిక వసతులు సమకూర్చడం లేదు.
- 9లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం:	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	589.00 అడుగులు
ఇన్‌ఫ్లో	4,61,245 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్ల	4,12,078 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	28,460 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	5,292 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	5,510 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం:	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	644 అడుగులు
ఇన్‌ఫ్లో	10,179.65 క్యూసెక్కులు
క్రస్ట్ గేట్ల	13,300 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	145.39 క్యూసెక్కులు
కుడికాల్వకు	145.39 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

'ఉత్తమ్ హామీలు ఊరడింపులా ఉన్నాయి'

భువనగిరిటౌన్ : సాగునీటి ప్రాజెక్టులపై శుక్రవారం భువనగిరిలో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రులు హామీలు ఇచ్చారే తప్పా.. నిధుల విడుదలపై ఊసెత్తలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బునాదిగాని,పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాల్వల ఆధునీకరణపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఊరడింపులా ఉన్నాయని ఎద్దేవా చేశారు. నిధులు విడుదల చేయకుండా సమీక్ష సమావేశాలతో ఒరిగేదేమీ ఉండదన్నారు. బునాదిగాని కాల్వ పనులను ఏడేళ్ల క్రితం ప్రారంభించారని, 98 కిలో మీటర్లకు గాను ఇప్పటివరకు 34 కిలో మీటర్లు మాత్రమే పూర్తవడం పరిస్థితికి అద్దం పడుతుందన్నారు. తక్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న బైక్ ర్యాలీలు నిర్వహిస్తామని, 9వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు.

ఆరోగ్య సంరక్షణే లక్ష్యం



మాట్లాడుతున్న సంక్షేమ అధికారి కృష్ణవేణి

భువనగిరిటౌన్ : ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యమని, అందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు పోషణ మాసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి కేవీ కృష్ణవేణి తెలిపారు. భువనగిరి ఐసీడీఎస్ కార్యాలయంతో పాటు, పలు సెక్టార్లలో శనివారం నిర్వహించిన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. మంచి ఆహారం, ఆరోగ్య అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేసే విషయంలో నిర్లక్ష్యం వహించరాదని కార్యకర్తలు, ఆయాలకు సూచించారు. కేంద్రాలను శుభ్రంగా ఉంచాలని, ప్రీ స్కూల్ కార్యక్రమాలు సిలబస్ ప్రకారం జరగాలన్నారు. సమావేశంలో సీడీపీఓ శాగం శైలజ, సూపర్‌వైజర్లు పద్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అమ్మనబోలు వాసికి గద్దర్ స్మారక అవార్డు



ప్రొఫెసర్ ఖాసీం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న భైరపాక స్వామి

మోటకొండూర్ : మండలంలోని అమ్మనబోలుకు చెందిన భైరపాక స్వామికి గద్దర్ స్మారక అవార్డు లభించింది. గద్దర్‌పై ఎర్రని మందారమా.. గద్దరన్న గానమా.. అని స్వామి రాసిన పాటకు శనివారం మహబూబాబాద్ తొర్రూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గిద్దె రాంనర్సయ్య, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, గద్దర్ కుమార్తె వెన్నెల, ఏపూరి సోమన్న, నలిగంటి శరత్ పాల్గొన్నారు.

రైతులకు సేవ చేయడం అదృష్టం



మాట్లాడుతున్న డీఏఓ గోపాల్

యాదగిరిగుట్ట రూరల్ : రైతులకు సేవ చేయడం గొప్ప అవకాశమని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) గోపాల్ పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న పలువురు వ్యవసాయ అధికారులకు శనివారం యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటలోని రైతువేదికలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డీఏఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి అన్నం పెట్టే రైతులకు సేవ చేయడం అదృష్టంగా భావించాలన్నారు. ఏడీఏ పద్మావతి, ఏఓ రాజేష్‌కుమార్, ఏఈఓ యాదగిరిగుట్ట డివిజన్ పరిధిలో రైతులకు ఉత్తమ సేవలు అందజేశారని ప్రశంసించారు. ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించారని పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన వ్యవసాయ అధికారులు కూడా సాగులో సలహాలిస్తూ రైతుల మన్ననలు పొందాలని సూచించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో ఏడీఏ శాంతి నిర్మల, ఏఓ సుధారాణి, తుర్కపల్లి ఏఓ ఉమ, డివిజన్ ఏఈఓలు, సీడ్ అండ్ ఫర్టిలైజర్ షాప్ యజమానుల జిల్లా సెక్రటరీ పబ్బ సతీష్, రైతులు పాల్గొన్నారు.



మూసీకి వరద ఉధృతి

బీబీనగర్ : హైదరాబాద్ జంటనగరాల్లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి భారీ కురుస్తున్న వర్షాలకు మూసీకి వరద ఉధృతి పెరిగింది. భూదాన్‌పోచంపల్లి మార్గంలో గల రుద్రవెల్లి - జూలూరు మధ్య లోలెవల్ బ్రిడ్జి వద్ద, భట్టుగూడెం - పెద్దరావులపల్లి మార్గంలో మూసీకి వరద ఉధృతి పెరుగుతుండడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. పెద్దరావులపల్లి, చిన్నరావులపల్లి, రుద్రవెల్లి, భట్టుగూడెం, జంపల్లి, గుర్రాలదండు గ్రామాల పరిధిలోని మూసీ నది వెంట పంట పొలాలు నీట మునిగాయి.

భట్టుగూడెం - పెద్దరావులపల్లి మధ్య మూసీలో వరద నీటి ప్రవాహం

రోజంతా ముసురు

- అత్యధికంగా పోచంపల్లి మండలంలో 63.8 మిల్లీ మీటర్ల వర్షం
- భువనగిరి, భూదాన్‌పోచంపల్లిలో లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు
- రాజాపేట, ఆత్మకూర్(ఎం), చౌళ్లరామారంలో ఈదురుగాలులకు కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

సాక్షి నెట్‌వర్క్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావానికి జిల్లా వ్యాప్తంగా శనివారం వర్షం కురిసింది. కొన్ని చోట్ల మోస్తరుగా, మరికొన్ని చోట్ల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అత్యధికంగా భూదాన్‌పోచంపల్లి మండలంలో 63.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

◆ రాజాపేట మండల పరిధిలో ఈదురు గాలులతో కూడిన వర్షానికి పలు చోట్ల చెట్లు కూలిపోయాయి. పంట చేలల్లో నీరు నిలిచింది.

◆ ఆత్మకూరు(ఎం) మండల కేంద్రం సమీపంలో చెట్టు కూలి రోడ్డుపై పడిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

◆ భువనగిరి పట్టణంలోని లోతట్టు ప్రాంతాల కాలనీలు, బస్టాండ్‌లో వర్షపు నీరు చేరడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. డ్రెయినేజీలు పొంగి పొర్లి భువనగిరి - నల్లగొండ రోడ్డు మీదుగా మురుగునీరు ప్రవహించడంతో వాహనదారులు, స్థానికంగా నివాసం ఉంటున్న ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

◆ అడ్డగూడూరు మండలంలోని చౌళ్లరామారంలో భారీ వృక్షాలు రోడ్లపై విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఐదు విద్యుత్ స్తంభాలు విరిగిపడి సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



భువనగిరిలో రోడ్డు పైనుంచి వరద నీరు..



ఆత్మకూరు(ఎం) సమీపంలో రోడ్డుపై కూలిన చెట్టు

గుట్టలో అత్యవసర బృందం

యాదగిరిగుట్ట రూరల్ : భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచన మేరకు యాదగిరిగుట్ట మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ఎటువంటి సమస్య ఎదురైనా అధిగమించేందుకు అత్యవసర బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇళ్ల, కాలనీల్లోకి వరద నీరు వచ్చినా, పాత ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉన్నా అత్యవసర బృందానికి సమాచారం ఇవ్వాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఎరుకల సుధ, కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి ప్రజలకు సూచించారు. వర్షాలకు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



అత్యవసర బృందానికి సూచనలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ

మండలాల వారీగా కురిసిన వర్షం (మి.మీ)

మండలం	వర్షపాతం
పోచంపల్లి	63.8
చౌటుప్పల్	45.3
రామన్నపేట	43.5
ఆత్మకూర్(ఎం)	42.5
మోత్కూరు	37.0
నారాయణపురం	36.8
రాజాపేట	35.3
వలిగొండ	34.3
భువనగిరి	28.0
యాదగిరిగుట్ట	27.3
బీబీనగర్	27.3
తుర్కపల్లి	24.8
గుండాల	22.0
ఆలేరు	19.0
మోటకొండూర్	18.8
బొమ్మలరామారం	14.3
అడ్డగూడూరు	10.09

కరువు నేలలో చిగురిస్తున్న ఆశలు

గంధమల్ల రిజర్వాయర్‌కు నిధుల కేటాయింపు

- 1.41 టీఎంసీల సామర్థ్యం.. రూ.575 కోట్ల అంచనా వ్యయం
- త్వరలో పనులు ప్రారంభిస్తామని సమీక్ష సమావేశంలో ప్రకటించిన మంత్రి ఉత్తమ్
- మాట నిలుపుకోవాలని కోరుతున్న రైతులు



రిజర్వాయర్‌కోసం ప్రతిపాదించిన తుర్కపల్లి మండలంలోని గంధమల్ల చెరువు

సాక్షి, యాదాద్రి : సాగునీటి వనరులు లేక, వర్షాభావ పరిస్థితులతో కొట్టుమిట్టాడుతున్న ఆలేరు ప్రాంత రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కాళేశ్వరం ద్వారా నీరందించే గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం ఎట్టకేలకు నిధులు కేటాయించడంతో తమకు గోదావరి జలాలు అందుతాయన్న ఆశతో ఉన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై రెండు రోజుల క్రితం భువనగిరిలో జరిగిన సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గంధమల్ల పనులపై క్లారిటీ ఇచ్చారు.

ఐదేళ్ల తరువాత గ్రీన్‌సిగ్నల్

కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ- 15లో భాగంగా తుర్కపల్లి మండలంలోని గంధమల్ల చెరువును రిజర్వాయర్ చేయాలని అప్పటి ప్రభుత్వం ప్రతిపాదించింది. 9.36 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించాలని నిర్ణయించారు. కానీ, ముంపు తీవ్రత, భూసేకరణ అధికంగా ఉండడంతో వివిధ వర్గాల నుంచి వచ్చిన అభ్యంతరాల మేరకు ప్రాజెక్టు సామర్థ్యాన్ని 4.28 టీఎంసీలకు కుదించారు. అయినప్పటికీ ముంపు గ్రామాల ప్రజల నుంచి ప్రతిఘటన ఎదురవడంతో ఐదేళ్లుగా ప్రాజక్టును హోల్డ్‌లో పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం రిజర్వాయర్‌కు పచ్చజెండా ఊపింది.

రిజర్వాయర్ స్వరూపం ఇదీ.. గంధమల్ల రిజర్వాయర్‌ను ముందుగా రూ.860 కోట్ల అంచనా వ్యయంతో 9.36 టీఎంసీల సామర్థ్యంతో ప్రతిపాదించారు. దీంతో గంధమల్ల, వీరారెడ్డిపల్లి, తెట్టకుంటతండా, బీమారిగూడెం, ఇందిరానగర్ గ్రామాల్లోని 1,654 ఇళ్లు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. తమ గ్రామాలను ముంపు నుంచి తప్పించాలని ప్రజలనుంచి వచ్చిన వినతులు, ఆందోళనల నేపథ్యంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. 569 కోట్ల అంచనా వ్యయంతో 4.28 టీఎంసీలకు ప్రాజెక్టు సామర్థ్యాన్ని తగ్గించారు. 2.85 కిలో మీటర్ల పొడవు, 52 మీటర్ల ఎత్తుతో ప్రతిపాదించారు. ముందుగా ప్రతిపాదించిన ప్రకారం ముంపుకు గురయ్యే వీరారెడ్డిపల్లి తప్పా మిగతా అన్ని గ్రామాల్లో 1,145 ఇళ్లు ముంపునకు గురయ్యేవి. తాజా ప్రతిపాదనలతో ముంపు తప్పనుంది.

తగ్గిన భూసేకరణ

భూసేకరణ సమస్యను అధిగమించడానికి ప్రభుత్వం ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యాన్ని గణనీయంగా తగ్గించింది. 9.36 టీఎంసీల రిజర్వాయర్ కోసం అటవీ, రైతుల నుంచి 4,027 ఎకరాలు సేకరించాల్సి ఉండేది. 4.28 టీఎంసీలకు కుదించగా 2,423 ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు. తాజాగా 1.41 టీఎంసీలకు కుదించడంతో 1,144 ఎకరాలు, రూ.575 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు.

మాట నిలుపుకోవాలి



గత సర్కార్ గంధమల్ల రిజర్వాయర్‌ను ప్రతిపాదించింది కానీ పనులు ప్రారంభించలేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు గంధమల్ల ప్రాజెక్టు నిర్మిస్తామని హామీ ఇచ్చింది. నిధులు కూడా కేటాయిస్తున్నట్లు ఇటీవల మంత్రి ప్రకటించారు. రిజర్వాయర్‌ను పూర్తిచేసి మాట నిలుపుకోవాలి. రిజర్వాయర్ నిర్మిస్తే రాజాపేట, ఆలేరు ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరుగుతాయి.

–చింతగారి అంజయ్య, రైతు, బేగంపేట

సమస్య తీరుతుంది



గంధమల్ల రిజర్వాయర్‌కు నిధులు కేటాయించడం హర్షణీయం. ప్రస్తుతం సరైన నీటి వనరులు లేక ఐదు ఎకరాలు సాగు చేస్తున్నాం. వేసవిలో నీళ్లందక పొలాలు ఎండిపోతున్నాయి. వర్షాలు పడితేనే నీళ్లు చెరువులో ఉంటాయి. లేదంటే ఎండిపోతాయి. రిజర్వాయర్ పూర్తయితే సాగు నీరు పుష్కలంగా లభించి సమస్య తీరుతుంది.

–పుచ్చుల శ్రీరామ్, రైతు, గౌరాయపల్లి

గణేశ్ ఉత్సవాలకు ఇబ్బంది కలగొద్దు

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే, చిత్రంలో డీసీపీ రాజేశ్‌చంద్ర

సాక్షి,యాదాద్రి : గణేశ్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతవాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంత్ కే.జండగే అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీసీపీ రాజేశ్‌చంద్రతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశమై గణేశ్ నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు, నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఉత్సవాలు ప్రారంభం మొదలుకుని నిమజ్జనం పూర్తయ్యే వరకు ప్రతి శాఖ తమ పాత్రను సమర్థవంతంగా పోషించాలని సూచించారు. ప్రధానంగా అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు గత సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ఉత్సవాలు ప్రశాంతంగా కొనసాగడానికి మండల, గ్రామ స్థాయిలో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. డీసీపీ రాజేశ్‌చంద్ర మాట్లాడుతూ గణేశ్ శోభాయాత్ర రోజు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తామన్నారు. విగ్రహాల సైజుకు తగిన విధంగా వాహనాలను సమకూర్చుకోవాలని ఉత్సవ కమిటీలకు సూచించారు. సకాలంలో విగ్రహాలను నిమజ్జనానికి తరలించాలని, చెరువుల వద్ద జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గంగాధర్, బెన్‌షాలోమ్, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, శాంతి సంఘం సభ్యులు, ఉత్సవ కమిటీల సభ్యులు, అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ స్కూళ్లలో వసతులు తప్పనిసరి

భువనగిరిటౌన్ : ప్రభుత్వ, ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్న సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లలో అన్ని వసతులు ఉండాలని కలెక్టర్ హనుమంతు కే.జండగే సూచించారు. రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, ప్రైవేటు భవనాల యజమానులు, పంచాయతీరాజ్ ఇంజనీర్లతో శనివారం కలెక్టరేట్‌లో సమావేశమై సౌకర్యాలపై సమీక్షించారు. జిల్లాలో ఎనిమిది సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలకు గాను నాలుగు సొంత భవనాలు, నాలుగు ప్రైవేట్ భవనాల్లో నడుస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భవనాలకు సంబంధించి మరమ్మతులు, వసతులపై ప్రతిపాదనలు రూపొందించాలని ఇంజనీర్లకు సూచించారు. అలాగే ప్రైవేట్ భవనాల యజమానులు ప్రిన్సిపాళ్లు సూచించిన ప్రకారం మరమ్మతులు చేయించి, వసతులు కల్పించాలని ఆదేశించారు. పరిశుభ్రత పాటించాలని, వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ జోనల్ ఆఫీసర్ విద్యారాణి పాల్గొన్నారు.

స్వయంప్రతిపత్తితో ఆలయం అభివృద్ధి

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దేవాదాయ శాఖను ఆదేశించడం హర్షణీయమని, ఆలేరు నియోజకవర్గ ప్రజల తరఫున ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. యాదగిరిగుట్టలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వయంప్రతిపత్తి కలిగి ఉండడం వల్ల ఆలయం మరింత చెందడానికి అవకాశం ఉంటుందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆలయ రాజగోపురానికి బంగారు తాపడం పనులు, అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులను పూర్తిచేయాలని సీఎం ఆదేశించడం శుభపరిణామం అన్నారు. యాదగిరిగుట్టలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని టూరిజం చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి ప్రకటించడం సంతోషకరమన్నారు.

ప్రతిపక్ష కౌన్సిలర్లకు విలువేది?

- వార్డుల్లో మున్సిపల్ చైర్మన్, అధికారులు పర్యటించినప్పుడు సమాచారం ఇవ్వడం లేదు
- ప్రభుత్వ కార్యక్రమాలకు పిలువడంలేదు
- భువనగిరి మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్‌లో ప్రతిపక్ష సభ్యుల నిరసన



పోడియం వద్ద బైఠాయించిన కౌన్సిలర్ స్వామి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరిటౌన్ : మున్సిపల్ చైర్మన్, అధికారులు ప్రతిపక్ష కౌన్సిలర్ల మాటకు విలువ ఇవ్వడం లేదు.. వార్డుల్లో పర్యటించిన సమయంలో సమాచారం ఇవ్వకుండా అగౌరవపరుస్తున్నారంటూ.. ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు శనివారం జరిగిన భువనగిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించే సమయంలో ఫ్లోర్ లీడర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఎజెండా అంశాలపై చర్చించేవారని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదని వాపోయారు. ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఎజెండాలో ఏ అంశాలు చేర్చారో సమావేశం రోజువరకు తెలియడం లేదన్నారు. అటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని, లేనిపక్షంలో సీడీఎంఏలో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

పోడియం ఎదుట బైఠాయించి నిరసన

అధికారులు, పాలకవర్గం తీరును నిరసిస్తూ 8వ వార్డు కౌన్సిలర్ పంగరెక్కల స్వామి పోడియం ఎదుట బైఠాయించారు. మున్సిపల్ చైర్మన్, అధికారులు తన వార్డులో కార్యక్రమాలు చేపడుతున్నా తనకు ఎందుకు సమాచారం ఇవ్వడంలేదంటూ ప్రశ్నించారు. తోటి కౌన్సిలర్లకు కూడా కలగజేసుకుని అందరిదీ అదే సమస్య అని వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు స్పందిస్తూ స్వామికి రెండుసార్లు ఫోన్ చేసినా కలవలేదని, తప్పనిసరి కావడంతో సదరు వార్డులో పనులు చేపట్టినట్లు తెలిపారు. స్థానిక కౌన్సిలర్లకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి అధికారులను ఆదేశించారు.

14 ఎజెండా అంశాలు ఆమోదం

మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులతో పాటు చెల్లింపులకు సంబంధించి 14 ఎజెండా అంశాలను సమావేశంలో ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. కాగా పెండింగ్ పనులు పూర్తి చేయాలని పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ చైర్మన్‌ను కోరారు. అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయండి


- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు



జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి జయరాజు

భువనగిరి రూరల్ : ఈనెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు పోలీసు అధికారులు, న్యాయవాదులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు సూచించారు. శనివారం భువనగిరిలోని జిల్లా కోర్టు సమావేశ మందిరంలో న్యాయసేవా సంస్థ అధికారులు, పోలీసు అధికారులతో సమావేశమై లోక్ అదాలత్‌పై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న రాజీపడదగు కేసుల వివరాలు తెలుసుకున్నారు. కక్షిదారులకు అవగాహన కల్పించి కేసులు రాజీపడేలా కృషి చేయాలని పేర్కొన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌పై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం జరిగిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో ప్రధాన జడ్జి జయరాజు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలోని వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు, విచారణ తీరు తదితర అంశాలను సమీక్షించారు. పెండింగ్ కేసులను త్వరితగతి పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజేశ్‌చంద్ర,ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బరువెత్తి.. సత్తా చాటి



యాదాద్రి భువనగిరి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరులో శనివారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బరువు ఎత్తుతున్న లిఫ్టర్

క్లుప్తంగా

కేవీకే కార్యక్రమాలు రైతులకు ఉపయోగకరం



కేవీకేలో మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం సభ్యులు

గరిడేపల్లి: కేవీకే ద్వారా చేపడుతున్న వివిధ క్షేత్రస్థాయి పరిశోధనలు, శిక్షణా కార్యక్రమాలు, సదస్సులు, వ్యవసాయ సంబంధిత డెమో ప్రదర్శనలు జిల్లా రైతాంగానికి ఎంతో ఉపయోగకరమని తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఫౌండర్, ప్రెసిడెంట్ ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం గరిడేపల్లి మండల పరిధిలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రాన్ని తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం సభ్యులు సందర్శించారు. కేవీకే ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను కేవీకే శాస్త్రవేత్తలు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. అనంతరం వైస్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కేవీకేతో కలిసి రైతాంగానికి అవసరమైన సాంకేతికతను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

రెండు తలలు, ఆరు కాళ్లతో గేదె దూడ జననం

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన రైతు పెద్దిరెడ్డి బుచ్చిరెడ్డి గేదె శనివారం రెండు తలలు, ఆరు కాళ్ల దూడకు జన్మనిచ్చింది. అయితే జన్మించిన కొద్దిసేపటికే దూడ మృతిచెందింది. రెండు తలలు, ఆరు కాళ్ల దూడను చూడడానికి గ్రామస్తులు తరలివచ్చారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని..

- ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య
- నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను హత్య చేసిన భార్యతో పాటు ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మోతె మండలం రాయపాడ్ గ్రామానికి చెందిన ఒర్సు వెంకన్న(50), అతడి భార్య మైసమ్మ నల్లగొండ పట్టణంలోని ముశంపల్లి రోడ్డులో గల హైటెక్ కాలనీలో ఖాళీ స్థలంలో గుడిసె వేసుకుని నివాసముంటున్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మైసమ్మకు నల్లగొండ మండలం వెలుగుపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కండె భిక్షంతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం భర్తకు తెలియడంతో పలుమార్లు ఆమెను మందలించాడు. దీంతో ఎలాగైనా భర్త అడ్డు తొలగించుకోవాలని ప్రియుడితో కలిసి మైసమ్మ పథకం వేసింది. ఆగస్టు 28వ తేదీ రాత్రి 11గంటల సమయంలో వెంకన్న మద్యం కోసం బయటకు వెళ్లి వచ్చేసరికి మైసమ్మ ప్రియుడు భిక్షంతో సన్నిహితంగా ఉండటం చూశాడు. భిక్షంను పట్టుకునేందుకు ప్రయత్నించగా అతడు పారిపోయాడు. కోపోద్రిక్తుడైన వెంకన్న భార్య మైసమ్మపై చేయి చేసుకోబోతుండగా.. ఆమె ఎలాగైనా అతడిని చంపాలని బండరాయిపై నెట్టి వేసింది. దీంతో వెంకన్న తలకు తీవ్ర గాయమైంది. అనంతరం మైసమ్మ భర్తపై కూర్చొని గొంతు నులిమి హత్య చేసింది. అతడు మృతి చెందినట్లు నిర్ధారించుకున్న తర్వాత మైసమ్మ అక్కడి నుంచి పారిపోయింది. మృతుడి సోదరుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న వన్‌టౌన్ పోలీసులు నిందితులను మేళ్లదుప్పలపల్లి రోడ్డులో పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ సందీప్, శంకర్, వెంకట్ నారాయణ, సిబ్బంది శ్రీకాంత్, షకీల్‌ను డీఎస్పీ అభినందించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడి వివాహం కావాల్సి ఉంది. మైసమ్మ ప్రియుడు భిక్షంకు వివాహం కాగా గొడవల కారణంగా భార్యకు దూరంగా ఉంటున్నట్లు తెలిసింది.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్ట్

- మత్తు టాబ్లెట్లు, గంజాయి, 4 సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం

నల్లగొండ క్రైం: గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి గంజాయి, మత్తు టాబ్లెట్లు స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నల్లగొండ పట్టణంలోని నెహ్రూగంజ్‌కు చెందిన ఎస్‌డీ షోహెబ్, అక్కచెల్మ ప్రాంతానికి చెందిన ఎండీ ఇమ్రాన్‌పాషా, తిప్పర్తి మండలం అనిసెట్టిదుప్పలపల్లికి చెందిన గంటెకంపు దుర్గాప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన శీలం వెంకట త్రిపుర అభినయ్ శుక్రవారం మాచర్ల నుంచి నల్లగొండకు సాగర్ మీదుగా గంజాయి తీసుకొన్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో కనగల్ మండలం తేలకంటిగూడెం వద్ద కనగల్ ఎస్‌ఐ విష్ణుమూర్తి, తన సిబ్బందితో కలిసి నలుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 150 గ్రాముల గంజాయి, రూ.2500 నగదు, మత్తు టాబ్లెట్లు, నాలుగు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా పోలీసులు గంజాయి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఎవరైనా గంజాయి తాగినా, విక్రయించినా 8712670266 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ముగిసిన శ్రీకాంత్‌రావు అంత్యక్రియలు



శ్రీకాంత్‌రావు (ఫైల్)

డిండి: లండన్‌లో అనారోగ్యంతో మృతిచెందిన డిండి మండలం తవక్లాపూర్ గ్రామానికి చెందిన వేముల శ్రీకాంత్‌రావు(29) అంత్యక్రియలు శనివారం స్వగ్రామంలో పూర్తయ్యాయి. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న శ్రీకాంత్‌రావు ఆగస్టు 21వ తేదీన మృతిచెందగా.. శనివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు అతడి మృతదేహం చేరుకుంది. అక్కడి నుంచి శ్రీకాంత్‌రావు మృతదేహాన్ని కుటుంబ సభ్యులు తవక్లాపూర్ గ్రామానికి తరలించి అంతిమ సంస్కారాలు పూర్తిచేశారు. ఉన్నతస్థాయికి ఎదుగుతాడనుకున్న కుమారుడు విగతజీవిగా తిరిగి రావడంతో శ్రీకాంత్‌రావు తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, రజిత దంపతులు గుండెలవిసేలా రోదించారు. శ్రీకాంత్‌రావు కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పరామర్శించారు.

‘సంకల్ప్’ను ప్రారంభించిన బీబీనగర్ ఎయిమ్స్



ఆదిలాబాద్ జిల్లాలో వైద్య బృందంతో సమావేశమైన బీబీనగర్ ఎయిమ్స్ వైద్యులు

బీబీనగర్: నవజాత శిశువుల మరణాలను తగ్గించే లక్ష్యంతో బీబీనగర్ ఎయిమ్స్ ఆగస్టు 27న ఐసీఎంఆర్ పరిశోధనా ప్రాజెక్టు ‘సంకల్ప్’ను ప్రారంభించింది. ఈ మేరకు ఎయిమ్స్ పరిశోధనా బృందం శనివారం ఆదిలాబాద్ జిల్లాలోని పీహెచ్‌సీలను సందర్శించి ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను అంచనా వేసి ప్రాజెక్టు అమలుకు సంబంధించి అక్కడి వైద్యులు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, నర్సింగ్ అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం నవజాత శిశు మరణాల రేటును ప్రతి 1000 సజీవ జననాలకు 10కంటే తక్కువకు తగ్గించాలనే లక్ష్యంతో జిల్లా వైద్య అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శ్రీమతి, ఐఏఎస్ అధికారి కుష్బూ గుప్తా, డీహెంఎచ్‌ఓ కృష్ణ, ఎయిమ్స్ వైద్యురాలు తణిగైనాథన్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువతి ఆత్మహత్య

వలిగొండ: ఒంటరిగా ఉంటున్న యువతి జీవితంపై విరక్తితో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన వలిగొండ–రామన్నపేట మధ్యన రైల్వే ట్రాక్‌పై శనివారం జరిగింది. రైల్వే పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం గొల్లెపల్లికి చెందిన మైత్రి పూజ (23) తండ్రి బతుకుదెరువు నిమిత్తం ముంబైకి వలస వెళ్లగా.. ఆమె తన తల్లితో కలిసి గొల్లెపల్లిలోనే అమ్మమ్మ ఇంటి వద్ద ఉండేవారు. గతంలోనే పూజ తండ్రి చనిపోగా.. కొద్దిరోజులకే తల్లి కూడా మృతిచెందింది. దీంతో పూజ అమ్మమ్మ వద్దే ఉండేది. రెండేళ్ల క్రితం పూజ అమ్మమ్మ కూడా మృతిచెందింది. ఆమె మేనమామ బతుకుదెరువు నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. అప్పటి నుంచి పూజ ఒంటరిగానే ఉంటుంది. ఒంటరి జీవితంతో విసుగు చెందిన పూజ గతంలో కూడా రెండుసార్లు ఆత్మహత్యకు పాల్పడగా గ్రామస్తులు రక్షించారు. శుక్రవారం రాత్రి ఆమె వలిగొండ–రామన్నపేట మధ్యన రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. శనివారం ఉదయం గ్యాంగ్‌మెన్ చూసి రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిఇ తరలించారు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రజిత తెలిపారు.

ఆలయాల్లో చోరీలు చేస్తున్న దొంగల అరెస్ట్

- రూ.80వేల విలువైన బంగారు ఆభరణాలు, రూ.54వేల నగదు, ఆటో, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు



నిందితుల నుంచి రికవరీ చేసిన సొత్తును చూపుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం: ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఆటో, రూ.80వేల విలువైన బంగారు ఆభరణాలు, రూ.54 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను శనివారం డీఎస్పీ శివరాంరెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. తిప్పర్తి మండలం కేశరాజుపల్లి పరిధిలోని అంబేద్కర్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ కత్తుల యాదయ్య, అదే కాలనీకి చెందిన కత్తుల శివ ఉదయం వేళ ఆలయాల్లో రెక్కీ నిర్వహించి రాత్రి సమయాల్లో చోరీలకు పాల్పడుతుండేవారు. మునుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలోని జమస్తాన్‌పల్లి రోడ్డులో స్థానిక పోలీసులతో పాటు సీసీఎస్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నల్లగొండ నుంచి మునుగోడు వైపు వెళ్తున్న ఆటోను ఆపారు. అందులో వెళ్తున్న యాదయ్య, శివ అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా.. దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. కత్తుల యాదయ్య గతంలో పశువుల దొంగతనం కేసులో అరెస్టై జైలుకు వెళ్లినట్లు డీఎస్పీ తెలిపారు. ఇద్దరు కలిసి 14 ఆలయాల్లో చోరీలు చేసినట్లు పేర్కొన్నారు. వీరు తిప్పర్తి, కట్టంగూర్, నార్కట్‌పల్లి, నల్లగొండ రూరల్, కనగల్, మునుగోడు, చండూరు, హాలియా, వేములపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో 14 నేరాలకు పాల్పడినట్లు తెలిపారు. నిందితులు దొంగిలించిన సొత్తును రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డి, మునుగోడు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సీసీఎస్ ఎస్‌ఐ శివకుమార్, హెడ్‌కానిస్టేబుల్ విష్ణువర్ధన్‌గిరి, కానిస్టేబుల్ పుష్పగిరిని డీఎస్పీ అభినందించారు.

గొర్రెల అపహరణ

మర్రిగూడ: మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి 12 గొర్రెలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. స్థానిక ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యరగండ్లపల్లి గ్రామానికి చెందిన మారగోని జంగయ్య తనకున్న 50 గొర్రెలను శుక్రవారం మేతకు తీసుకువెళ్లి సాయంత్రం తన ఇంటి ముందు ఉన్న దొడ్డిలోకి తోలాడు. శనివారం ఉదయం మందలో 12 గొర్రెలు కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వలస కూలీ మృతి

హుజూర్‌నగర్‌రూరల్: జీవితంపై విరక్తితో ఉమ్మెంత కాయలు తిన్న వలస కూలీ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. శనివారం ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం నలంద జిల్లా దుర్గాపూర్‌కు చెందిన పంచలాల్ కుమార్ (22) మరో నలుగురితో కలిసి హుజూర్‌నగర్ మండలం అమరవరం గ్రామానికి చెందిన కర్నాటి వీరనాగిరెడ్డి రైస్ మిల్లులో కొంతకాలంగా హమాలీగా పనిచేస్తున్నాడు. ఇంటిపై బెంగ, జీవితంపై విరక్తితో ఈ నెల 27వ తేదీన పంచలాల్ కుమార్ మిల్లు పక్కన ఉన్న ఉమ్మెంత కాయలు తిన్నాడు. అవి తిన్న కొద్దిసేపటి తర్వాత అతడు కిందపడిపోయాడు. తోటి హమాలీలు గమనించి వెంటనే హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మిల్లు గుమాస్తా తేనె మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్థానిక సంస్థల్లో బీసీల ప్రాతినిధ్యం పెరగాలి

- బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు



కృష్ణమోహన్‌రావుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు కోరుతున్న విధంగా ప్రజా ప్రాతినిధ్యం పెరగాలని బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో బీసీలకు దామాషా మేరకు రిజర్వేషన్‌లు అమలు కావాలన్నారు. దానికి సంబంధించిన కులగణన ప్రశ్నావళి రూపొందించి ప్రభుత్వానికి ఇచ్చామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌లకు నిర్దిష్ట ప్రణాళికలు కూడా అందజేశామని తెలిపారు. బలహీన వర్గాలు కులగణన నిర్వహించాలని చిరకాలంగా కోరుతున్నాయని, అది ఎలాంటి అడ్డంకులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని కోరారు. రాష్ట్రంలోని బీసీలలోని సంచార విముక్తి జాతుల కులాలు ఇప్పటిక, ఆధునిక అభివృద్ధిని అందుకోలేక పోతున్నాయన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ నిర్ణయించడానికి విశేషంగా కృషి చేశానని, అయితే తన పదవి గడువు ముగియడంతో తుది నివేదిక ఇవ్వకుండా నిష్క్రమించడం ఇబ్బంది కలిగిస్తున్న విషయమన్నారు. బీసీ హక్కుల కోసం పనిచేయడం తన జీవితంలో మధురఘట్టమన్నారు. తన పదవి చివరి రోజు కావడంతో తమ ఇష్టదైవం లక్ష్మీనరసింహస్వామిని కుటుంబసభ్యులతో దర్శించుకున్నట్లు చెప్పారు. అంతకుముందు ఆయనకు ఆలయ సంప్రదాయ రీతిలో అధికారులు స్వాగతం పలికారు. స్వయంభూవులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. లడ్డూ ప్రసాదాన్ని ఈఓ భాస్కర్‌రావు అందించారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం



వెయిట్ లిఫ్ట్ చేస్తున్న క్రీడాకారిణి



పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు శృతి తదితరులు

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోచంపల్లి మండలంలోని జూలూరు గ్రామంలో శనివారం రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు ముకిరి శృతి ప్రారంభించారు. ఈ పోటీల్లో 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో యూత్ బాలికలు, బాలురు, సీనియర్ విభాగంలో పురుషులు, మహిళలు వెయిట్ లిఫ్టింగ్ పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడుతాయని అన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు అక్టోబర్‌లో హిమాచల్‌ప్రదేశ్‌లో జరుగనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. ఆదివారం ముగింపు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుస్పాల వెంకటరమణ, యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కాసుల భానుచందర్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కాసుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరేశంను అడ్డుకున్న ఏఆర్ కానిస్టేబుల్‌కు చార్జ్ మెమో

సాక్షి, యాదాద్రి: నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను అడ్డుకున్న విషయంలో ఏఆర్ కానిస్టేబుల్ రామకృష్ణకు పోలీస్ అధికారులు శనివారం చార్జ్ మెమో జారీ చేశారు. శుక్రవారం భువనగిరిలో నిర్వహించిన సాగునీటి ప్రాజెక్టుల సమావేశానికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెలికాప్టర్‌లో వచ్చారు. వారికి స్వాగతం పలకడానికి వెళ్తున్న ఎమ్మెల్యే వీరేశంను బాంబ్ స్క్వాడ్ టీం కానిస్టేబుల్ అడ్డుకోవడంతో ఆయన ఆగ్రహంతో అక్కడినుంచి వెళ్లిపోయారు. రాచకొండ సీపీ ఆదేశాల మేరకు డీసీపీ రాజేశ్‌చంద్ర విచారణ చేపట్టి కానిస్టేబుల్‌కు చార్జ్ మెమో జారీ చేశారు.

ప్రమాదం జరిగే వరకు పట్టించుకోరా !

- పెచ్చులూడి వర్షానికి కురుస్తున్న ఎస్సీ బాలుర హాస్టల్ భవనం
- విద్యార్థులను ఇళ్లకు పంపిన అధికారులు

మునుగోడు: చిన్నపాటి వర్షం కురిస్తే చాలు మునుగోడులో ఎస్సీ బాలుర హాస్టల్ భవనం స్లాబ్ పెచ్చులు ఊడి స్లాబులో నుంచి నీరు కురుస్తోంది. చిన్నపాటి వర్షం కురిసినా అందులో ఉంటున్న విద్యార్థులు తమ ప్రాణాలను అరచేతిలో కాలం వెల్లదీస్తున్నారు. ఈ విషయమై సాక్షి దినపత్రికలో ఒకమారు ప్రధాన సంచిక మొదటి పేజీలో, అంతకు ముందు జిల్లా పేజీలో కథనం ప్రచురితమైంది. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో పాటు కలెక్టర్ నారాయణరెడ్డి గతంలో ఆ హాస్టల్‌ను సందర్శించి వెంటనే ఆ హాస్టల్‌ను అద్దె భవనంలోకి మార్చాలని ఆదేశించారు. కానీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు అద్దె భవనంలోకి మార్చకుండా అందులోనే కొనసాగిస్తున్నారు. అయితే శుక్రవారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి హాస్టల్ భవనం కురవడంతో పాటు స్లాబ్ పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. విషయం తెలిసిన రెవెన్యూ అధికారులు శనివారం ఆ హాస్టల్‌ను సందర్శించి వెంటనే విద్యార్థులను తమ ఇళ్లకు వెళ్లాలని సూచించారు. దీంతో ఆ హాస్టల్‌లో ఉండే 30మంది విద్యార్థులు వెళ్లిపోయారు. కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని హాస్టల్ భవనాన్ని మరొక చోటుకు మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

అధిక వర్షాలు.. పంటల రక్షణ

పెద్దవూర: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో కొన్ని పంటలకు మేలు కలిగిస్తున్నా, పల్లపు ప్రాంతంలో సాగులో ఉన్న పత్తి, మిరప, పప్పుదినుసుల పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఈ పంటలు నీటిలో మునగడంతో వాటికి చీడపీడల సమస్యలు ఎదురవుతున్నాయి. సకాలంలో వాటి నివారణకు చర్యలు తీసుకోకపోతే దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిస్థితులలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులను పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్ వివరించారు.



నీట మునిగిన పత్తి చేను

పత్తి పంట

- సాధ్యమైనంత వరకు పత్తి చేనులో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. ఎప్పటికప్పుడు కాల్వలను ఏర్పాటు చేసుకుని నీటిని తొలగించాలి.
- వర్షాలు తగ్గిన వెంటనే వీలైనంత త్వరగా భూమిలో తేమను తగ్గించుకునేందుకు అంతర సేద్యం చేయాలి.
- అంతర సేద్యం చాలారోజుల వరకు వీలు కాకపోతే, కలుపు సమస్య ఎక్కువగా ఉంటే విత్తిన 45–60 రోజుల పైరులో ఎకరాకు 400 మి.లీ. క్విజల్ ఫాస్ ఇథైల్+పైరిథయోబాక్ సోడియం 250 మి.లీ. కలిపి పిచికారీ చేసి కలుపును నివారించుకోవాలి.
- వర్షాలు తగ్గిన వెంటనే బురద పదునులో ఎకరాకు 30 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరట్ ఆఫ్ పొటాష్‌ను పైపాటుగా వేయాలి. లీటరు నీటికి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్, 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపి ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారీ చేయాలి. విత్తిన సమయంలో భాస్వరం ఎరువును వేయని రైతులు ఎకరాకు 50 కిలోల డీఏపీ ఎరువు వేసుకోవచ్చు.



- ఆకుపచ్చ తెగుళ్ల తీవ్రత పెరగడానికి అవకాశం ఉన్నందున వర్షాలు తగ్గాక సాఫ్ లేదా కంపానియన్ అనే శిలీంద్రనాశిని మందు 2గ్రాముల చొప్పున, అలాగే ప్లాంటోమైసిన్ లేదా స్ట్రెప్టోసైక్లిన్ 0.2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పత్తిలో వర్షాలు తెరిపి ఇచ్చిన తర్వాత పిండి నల్లి ఉధృతి ఎక్కువయ్యే అవకాశం ఉంది. దీని నివారణకు గాను లీటరు నీటికి 1 మి.లీ. డైక్లోరోపాస్‌తో పాటు 2మి.లీ. ప్రొఫినోఫాస్ మందును కలిపి పిచికారీ చేసుకోవాలి. వర్షాలు తగ్గిన మూడు, నాలుగు రోజులకు వరుసల మధ్య భాగాన్ని గుంటుకలతో దున్నాలి.
- అధిక వర్షాలకు వేరుకుళ్లు తెగులు ఆశిస్తే లీటరు నీటికి 3 గ్రాములు కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా ఒక గ్రామ్ కార్బండిజమ్ కలిపి మొక్క మొదళ్లలో తడపాలి.

పెసర పంట

- పెసర, మినుము పంటల్లో పేనుబంక, లద్దెపురుగు ఆశించే అవకాశం ఉంది. లీటరు నీటికి ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ కలిపి పిచికారీ చేయాలి.
- 20 నుంచి 25 రోజుల దశలో ఉన్న పంటలో కలుపు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. అంతర సేద్యం సాధ్యం కానప్పుడు పెసర, మినుము పంటలలో ఎకరాకు 200 మి.లీ. ఇమిజిథాపిర్‌ను 200 మి.లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఈ మందు వాడినప్పుడు పంట పెరుగుదల తాత్కాలికంగా వారం రోజులు ఆగుతుంది. తరువాత తేరుకుని మామూలుగా ఉంటుంది.
- వర్షాలకు ఆకుపచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. నివారణకు లీటర్ నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలి.

మొక్కజొన్న పంట

ముందుగా ఎకరానికి 50 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌ను పైపాటుగా వేయాలి. కాండం తొలిచే పురుగు, ఆకుఎండు తెగులు తీవ్రత ఎక్కువగా ఉండటానికి అవకాశం ఉంది. దీని నివారణకు గాను ఎకరానికి 400 మి.లీ ప్రొఫినోఫాస్, 200 మి.లీల ప్రొఫికొనజోల్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి చేను బాగా తడిసే విధంగా పిచికారీ చేయాలి. వర్షాలు తగ్గిన తర్వాత వరుసలలో గుంటుకతో దున్నాలి.

మిరప పంట

- మిరప నారుమళ్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- నారుకుళ్లు తెగులు నారుమళ్లను ఆశిస్తే లీటర్ నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2 గ్రాముల రిడోమిల్ కలిపి వారంలో రెండు, మూడు సార్లు నారుమళ్లను తడపాలి.

కంది పంట

పొలంలో నిల్వ ఉన్న నీటిని త్వరగా బయటకు పంపాలి. ఎకరాకు 15 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరట్ ఆఫ్ పొటాష్‌ను పైపాటుగా వేయాలి. ఇనుపధాతు లోపం వచ్చే అవకాశం ఉన్నందున లీటరు నీటికి అన్నభేది 5–10 గ్రాములు,+ 1 గ్రాము నిమ్మ ఉప్పు కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు, లేదా మూడు సార్లు పిచికారీ చేయాలి. అధిక తేమ వల్ల ఎండుతెగులు వచ్చే ప్రమాదం ఉంది. దీంతో మొక్కలు వాడుబడుతున్నట్లు కనిపిస్తే లీటరు నీటికి ఒక గ్రాము చొప్పున కార్బండిజమ్ కలిపి మొక్కల మొదళ్ల దగ్గర తడపాలి.